బడులపై చిన్నచూపేలా..!



2



2

ఎలుగు బంటి దాడిలో గాయాలు

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## ఆర్మూర్ పోలీసుల విస్తృత తనిఖీలు



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ లో శుక్రవారం రాత్రి ఎస్హెచ్వో సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ లోని హోటల్, దుకాణాలతో పాటు ప్రయాణికుల బ్యాగులను డాగ్ స్క్వాడ్ బృందాలతో పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి మాదకద్రవ్యాలు, గంజాయి దొరకలేదని ఎస్హెచ్వో తెలిపారు.



## పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ప్రభుత్వ సలహాదారు పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్ని మండల కేంద్రంలోని సీసీడీ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆగ్రోస్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి అందజేశారు. నియోజకవర్గంలోని వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన మొత్తం 286 మంది లబ్ధిదారులకు రూ. 2.86 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో వర్ని మండలానికి చెందిన 67 మందికి రూ. 67 లక్షలు, చందూర్ మండలానికి చెందిన 33 మందికి రూ. 33 లక్షలు, మోస్రా మండలానికి చెందిన 16 మందికి రూ. 16 లక్షలు, రుద్రూర్ మండలానికి చెందిన 15 మందికి రూ. 15 లక్షలు, కోటగిరి మండలానికి చెందిన 96 మందికి రూ.96 లక్షలు, పోతంగల్ మండలానికి చెందిన 59 మందికి రూ. 59 లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ర్యాంకర్ సహదేవ్‌కు ఘన సన్మానం



**భీమ్‌గల్, అక్షరటుడే:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి రస సహదేవ్‌ను భీమ్‌గల్ సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. 470 మార్కులకు గాను 469 సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సహదేవ్‌ను కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థికి శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. కమిటీ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. కష్టపడి చదివితే గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలవగలరని సహదేవ్ నిరూపించాడని కొనియాడారు. భవిష్యత్తులో సహదేవ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రైటర్ రాజు, కమిటీ సభ్యులు రఘు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.



# యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

**జిల్లాలోని మున్సిపాలిటీల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రెండు మూడేళ్లుగా జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో నిబంధనల ఉల్లంఘనలు పరాకాష్టకు చేరాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, రాజకీయ అండదండలతో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు సైతం కబ్జాలకు గురవుతున్నాయి. నిబంధన లకు విరుద్ధంగా కొన్ని.. అనుమతులు లేకుండా మరికొన్ని.. అడ్డూఅదుపు లేకుండా నిర్మాణాలు కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.** – అక్షరటుడే, భీమ్‌గల్

■ నిబంధనలకు విరుద్ధంగా పనులు ■ పరిమితికి మించి అంతస్తుల నిర్మాణం ■ పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని మున్సిపాలిటీల్లో కొందరు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. కనీస నిబంధనలు పాటించడం లేదు. సెట్ బ్యాక్ వదిలేయడం లేదు. అనుమతులు తీసుకున్న దాని కంటే అదనంగా అంతస్తులు నిర్మిస్తున్నారు. మున్సిపల్ అధికారులు తమ కేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

### ప్రభుత్వ భూముల కబ్జా

బోధన్ పట్టణ శివార్లలోని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను కొంతమంది రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు కబ్జా చేసి షెడ్లు, గిడ్డంగులు నిర్మించారు. ముఖ్యంగా రాత్రికి రాత్రే షెల్టర్లు వేయడం, ఆ తర్వాత మున్సిపాలిటీ నుంచి ఇంటి నెంబర్లు పొందే ప్రక్రియ పరిపాటి అయింది. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ, మున్సిపల్ అధికారుల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు అనే ఆరోపణలు ఉన్నాయి.

### భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్ బల్దియా టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు లేరు. ఇళ్ల నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు ఇస్తుంది. ఇక్కడ ఇన్‌ఛార్జి టీపీఎస్ పని చేస్తున్నారు. వారంలో ఒక్క రోజు మాత్రమే భీమ్‌గల్‌కు వస్తారు. అక్రమ నిర్మాణాలపై టీపీఎస్‌కు కనీస అవగాహన కూడా లేదు. గత నెల రోజుల నుంచి ఆయన భీమ్‌గల్‌కు రావడం లేదు. ఈ విభాగంలో సిబ్బంది కొరతతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది.

### నిజామాబాద్ నగరంలో..

నగరంలో నాలాల ఆక్రమణతో ముంపు ముప్పు పొంచి ఉంది. గాయత్రీ నగర్, వినాయక్ నగర్, ప్రగతి నగర్ వంటి ప్రాంతాల్లో పూలాంగ్ వాగు పరీవాహక ప్రాంతాన్ని ఆక్రమించి ప్రహరీ గోడలు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు. ఫలితంగా స్వల్ప వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ముఖ్యంగా ఖిల్లా నుంచి కంఠేశ్వర్ వరకు ఉన్న ప్రధాన కాల్వలు ఆక్రమణకు గురై ప్రవాహం ఆగిపోతున్న వైనం జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది.

### ఆర్మూర్‌లో..

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో వ్యవసాయ భూములను వెంచర్లుగా మారుస్తున్నారు. మామిడిపల్లి, పెర్కిట్ వంటి శివారు ప్రాంతాల్లో గత రెండేళ్లుగా అనధికారిక లేఅవుట్ల జోరు పెరిగింది. డీటీసీపీ అనుమతులు లేకుండానే, పంట పొలాలను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కనీసం రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు లేకుండానే వెంచర్లు వెలిశాయి. వీటిపై మున్సిపల్ అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

### అనుమతికి మించి...

నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ రోడ్, ఆర్మూర్ రోడ్ ప్రాంతాల్లో మూడు అంతస్తులకు అనుమతి పొంది, ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. కనీసం సెట్ బ్యాక్ నిబంధనలు కూడా పాటించడం లేదు. అగ్నిప్రమాదాలు జరిగితే కనీసం ఫైర్ ఇంజిన్ వెళ్లే వీలు లేని పరిస్థితి ఉంది.

### చర్యలు తీసుకుంటాం

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. పట్టణ ప్రణాళిక విభాగంలో ఇన్‌ఛార్జి టీపీఎస్ ఉన్నారు. నిబంధనలు పాటించకుండా నిర్మించిన భవనాలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటాం. సంబంధిత ఇంటి యజమానులకు నోటీసులు అందజేస్తాం.

**–గోపు గంగాధర్, మున్సిపల్ కమిషనర్, భీమ్‌గల్**

### చర్యలు కరువు

భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని పురాణీపేట్ రోడ్డులో రెండంతస్తుల భవనాలు అనుమతులు లేకుండా కడుతున్నారు. బైపాస్ రోడ్డులో ఇంటి కోసం అనుమతి తీసుకుని, కమర్షియల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. బెజ్జోర బైపాస్ రోడ్డులో సుమారు 20 నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. బడాభీమ్‌గల్ రోడ్డు వెంట ఉన్న పాత పెట్రోల్ బంక్ సమీపంలో పెద్ద ఎత్తున కమర్షియల్ షెల్టర్లు నిర్మిస్తున్నారు. వీటిని కనీసం మున్సిపల్ అధికారుల కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. వేల్పూర్ రోడ్డులో ఇంటి నిర్మాణం పేరిట నాలుగు అంతస్తుల పెద్ద భవనాన్ని నిర్మించారు. బడాభీమ్ గల్ రోడ్డులోని రాథం చెరువులో పదుల సంఖ్యలో నిర్మాణాలు జరిగాయి.

## కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే, గాంధారి:** కాంగ్రెస్ మండల నాయకుడు అల్తాఫ్ గుండెపోటుతో ఇటీవల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల శ్రీనివాస్, హైమద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నగరంలో ఆర్టీసీ కార్మికుల రాస్తారోకో..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఉమ్మడిజిల్లాలో ఆర్టీసీ సమ్మె నిరవధికంగా కొనసాగుతోంది. నిజామాబాద్ జిల్లా లో రెండురోజులుగా కార్మికులు వివిధరకాలుగా నిరసన తెలుపుతున్నారు. జిల్లా కేంద్రంలోని రాజరాజేంద్ర చౌరస్తా వద్ద ఆర్టీసీ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. న్యాల్ కల్ డిపో-2 నుంచి బస్సులు బయటకు రాకుండా అన్ని మార్గాలను దిగ్బంధనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలువురు కార్మికులు ఆత్మహత్యాయత్నం చేశారని.. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు.

## జిల్లాలో తాగునీటి సరఫరాలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ/బోధన్:** జిల్లాలో తాగునీటి సరఫరాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలోని మండలాల ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీవోలు ఇతర అధికారులతో కలెక్టర్ తాగునీటి సరఫరాపై సమీక్షించారు. వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఒక్కో మండలం వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు మూడు నెలలు ఎంతో కీలకమైనందున, నీటి సరఫరా విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి కొరత ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు చేపట్టడానికి ముందు స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా మరమ్మతులు చేపట్టే విషయాన్ని ప్రజలకు సైతం ముందుగానే తెలియజేస్తే వారు తగిన విధంగా సన్నద్ధం అవుతారని సూచించారు. చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని, చేతి పంపులకు ఫ్లషింగ్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపలిటీల్లో తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును పక్కాగా పర్యవేక్షణ జరపాలని, తాను కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ఎక్కడైనా నిర్లక్ష్యానికి తావిస్తే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేందర్, డీపీవో శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, మిషన్ భగీరథ ఈఈలు రాకేష్, స్వప్న, డీఎల్పీవోలు శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి : ఎమ్మెల్యే కేవీఆర్



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి దిశానిర్దేశం చేశారు. జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని మండల, గ్రామ, పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. పార్టీ బలోపేతం అయినప్పుడే అన్ని ఎన్నికల్లో గెలవగలమని తెలిపారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని, ఈ ఎన్నికల్లో అందరు పోటీ చేసి గెలిచి కార్యకర్తలు నాయకులుగా అయ్యే అవకాశం ఉందన్నారు. గడిచిన రెండున్నరేళ్లలో అవినీతి రహిత కామారెడ్డి కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నానని, దానికోసం భవిష్యత్తులో ఉద్యమాలు చేయటానికైనా తాను సిద్ధమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలుకు ఉద్యమం చేయడానికి కూడా అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం రాజీనామా చేయాలి..



**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలని కామారెడ్డి ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికులంతా కలిసి బస్టాండ్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ర్యాలీగా బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దాంతో అక్కడే నిరసన తెలిపారు. బస్టాండ్ ఎదుట సుమారు అరగంటకు పైగా మానవహారం నిర్వహించారు. దాంతో వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ స్తంభించాయి. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసి మృతి చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. శంకర్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే ఆయన మృతికి కారణమని పేర్కొన్నారు. వెంటనే అతని కుటుంబంలో ఒకరికి రెగ్యులర్ ఉద్యోగం ఇవ్వాలని, కుటుంబానికి రూ.2కోట్ల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ డిమాండ్లలో 28 అంశాలు పరిష్కారం చేశామని మీడియా ముందు చెప్పడం సరికాదన్నారు. ఆయన తమ మంత్రి అని చెప్పుకోవడం కూడా ఇష్టం లేదన్నారు. ఆర్టీసీని తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. ఒక్క కార్మికుడు కూడా నేరుగా తన సమస్యను చెప్పుకోవడానికి డీఎం దగ్గరికి వెళ్లడానికి సాహసించడం లేదని, అందుకే యూనియన్లను అనుమతించాలన్నారు. ఆర్టీసీలో ఉన్న వంద శాతం బస్సులలో 40 శాతం ప్రభుత్వ, 60 శాతం అద్దె బస్సులు ఉన్నాయన్నారు. సమ్మెలో పాల్గొని కార్మికుల సమస్య పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని చెప్పారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు సైతం సమ్మెలో పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి బలం..: డీసీసీ అధ్యక్షుడు



**అక్షరటుడే, కామారెడ్డి:** కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో 24వ వార్డుకు చెందిన పలువురు శుక్రవారం పార్టీలో చేరారు. వారికి డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలమని, కొత్తగా చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గడ్డ మీద మహేష్, సుదర్శన్, రాజు, శ్రీను, చంద్రం, రామ కోటి, నందు, ప్రశాంత్, రఘు, రాజలింగం, గుడ్ల శీను, బ్రహ్మం, సంజయ్, దినేష్, అక్షయ్, మనోజ్, వరుణ్, బబ్లు, వసంత్, సూర్య, శశి, ప్రకాష్, శ్రీకాంత్, నవీన్, గణేష్, అజయ్, మల్లయ్య, ప్రకాష్, బన్నీ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బగలాముఖి జయంతి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో బగలాముఖి పీఠంలో అమ్మవారి జయంతి వేడుకలను శుక్రవారం పీఠాధిపతి క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాయాగం చేశారు. కార్యక్రమానికి భక్తులు, కుటుంబసమేతంగా హాజరయ్యారు. భగలాముఖి అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మంగళ హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.




# సర్కారు బడులపై చిన్నచూపేలా..?

ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విశేషంగా కృషి చేస్తోంది. పాఠశాలల్లో అనేక రకాల సౌకర్యాలు కల్పిస్తూ.. కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తోంది. ఈ సందర్భంగా సూళ్లల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌కు సంబంధించిన వస్తువులను సమకూరుస్తోంది. అయితే వేసవి సెలవుల్లో ఈ విలువైన వస్తువుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.
– అక్షరటుడే, గాంధారి

■ విలువైన వస్తువులకు భద్రత కరువు ■ సెలవు రోజుల్లో స్కూళ్లను పట్టించుకునేవారు లేరు.. ■ వాచ్‌మన్లు లేక ఇబ్బందులు

జిల్లాలో సర్కారు స్కూళ్ల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో వసతులు సమకూరుస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రొజెక్టర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు నెలలు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అయి తే రూ.లక్షలు వెచ్చించి తీసుకొచ్చిన ఐఎఫ్‌టీలకు, కంప్యూ టర్లకు ఎవరు కాపలా ఉంటారనేది తెలియకుండా ఉంది.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో 25 మండలాలు ఉండగా.. 184 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రతి మండల కేంద్రంలో ఒకటి, రెండు జడ్పీహెచ్‌ఎస్‌లు ఉన్నాయి. ఈ స్కూళ్లలో రూ.3లక్షలకు పైగా విలువైన ఐఎఫ్‌టీ (ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సిస్టం)లు ఏర్పాటు చేశారు. ఒక్కో స్కూల్‌లో రెండు నుంచి మూడు ఐఎఫ్‌టీలు ఉంటాయి. అలాగే కంప్యూటర్ ల్యాబ్‌లు కూడా చాలా పాఠశాలల్లో ఉన్నాయి. ఒక్కో స్కూల్‌లో వాటి విలువ సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుంది. స్కూళ్లు మూసివేసిన అనంతరం వాటి భద్రత ఎవరు చూస్తారనేది తెలియడం లేదు.

### వాచ్‌మన్లు ఉంటే బాగుండేది..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం రూ.లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు ప్రభుత్వం సమకూర్చినప్పటికీ వాటిని చూసుకునేందుకు వాచ్‌మన్లు ఏర్పాటు చేస్తే బాగుండేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కొన్ని పాఠశాలల్లోని క్రీడా మైదానాల్లో రాత్రయితే చాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. బడుల్లోని వస్తువులను కొందరు ధ్వంసం చేస్తున్నారు. ఈ క్రమంలో వాచ్‌మన్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### నైట్ వాచ్‌మన్ ఉండాలి..

ప్రభుత్వం విద్యార్థుల కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఐఎఫ్ టీలను, కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఆయా స్కూళ్లలో నైట్ వాచ్‌మన్ల అవసరమైతే ఉంది. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సర్క్యూలర్ రాలేదు. అలాంటి ఉత్తర్వులు వస్తే తప్పకుండా గ్రామస్థాయిలో చర్చించి నైట్ వాచ్‌మెన్లను నియమిస్తాం. అప్పటివరకు ఆయా ప్రాంతాల్లో గ్రామస్థులను పర్యవేక్షించాలని సూచించాం. రెండు, మూడురోజులకొకసారి ఆయా ప్రాంతాల వారీగా ఉపాధ్యాయులు తమ స్కూళ్లను పర్యవేక్షించాలని సూచించాం. – శ్రీహరి, ఎంఈవో

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..



**అక్షరటుడే, ముప్కాల్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ముప్కాల్ మండల బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో న్యాయం గెలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జోషి ఉమాశంకర్, సాయన్న, నిమ్మల నర్సయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, నవీన్, గద్దల సాయిలు, జక్కుల శ్రీనివాస్, శంకర్ పటేల్, ఒడ్డె పోశెట్టి, భూమన్న, రమేష్, నర్సింగ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి..

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని సిరికొండ, ధర్పల్లి, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, భీమ్‌గల్, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో తీవ్రం నష్టం వాటిల్లిందన్నారు. వాటితోపాటు టమాటా, మిర్చి, నువ్వు పంట, మామిడి తదితర పంటలు కొన్నిచోట్ల 50శాతానికి పైగా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని.. నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసినవారిలో ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, జిల్లా ప్రధానకార్యదర్శి బాబన్న, నాయకులు రిక్క దామోదర్, కిషన్, లింబాద్రి, సీహెచ్ పోశన్న పాల్గొన్నారు.

## ‘కాళేశ్వరం తీర్పు.. కాంగ్రెస్‌కు చెంపపెట్టు..!’



**అక్షరటుడే, భీమ్‌గల్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు అని బీఆర్ఎస్ భీమ్‌గల్ మండల నాయకులు పేర్కొన్నారు. భీమ్‌గల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు దొనకంటి నర్సయ్య మాట్లాడారు. కాళేశ్వరంలో ఎలాంటి అవినీతి జరగలేదని, మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావులపై చర్యలు తీసుకోవద్దని కోర్టు ఇచ్చిన ఆదేశాలు తెలంగాణ రైతాంగ విజయమని అభివర్ణించారు. రెండేళ్లుగా కాళేశ్వరంపై రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఈ తీర్పు పటాపంచలు చేసిందన్నారు. ప్రాజెక్టు మొత్తం ఖర్చే రూ.94 వేల కోట్లు అయితే.. రూ.లక్ష కోట్ల అవినీతి అనడం కాంగ్రెస్ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా చేపట్టిన రివర్స్ పంపింగ్ లేకపోతే ఈ వేసవిలో బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లో పంటలు ఎండిపోయేవని నాయకులు గుర్తుచేశారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో కప్పల వాగు నిండటం వల్లే నేడు భీమ్‌గల్ పట్టణంలో తాగు, సాగునీటికి కొరత లేదని స్పష్టం చేశారు. రివర్స్ పంపింగ్ ద్వారా వచ్చిన నీటితోనే మే నెలలోనూ వాగులు కళకళలాడుతున్నాయన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చౌటుపల్లి రవి, శర్మ నాయక్, మోయిాజ్, శ్రీనివాస్, ప్రకాష్, కౌన్సిలర్లు మల్లెల ప్రసాద్, నర్సయ్య, భగత్, రవి, నాయకులు పాల్గొన్నారు.

## అన్నాసాగర్‌లో ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ పితామహుడు బల్వంత్ రాయ్ మెహతా చిత్రపటానికి సర్పంచ్ స్రవంతి సాయాగౌడ్, ఉప సర్పంచ్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సంజీలు, పెద్దలు కలిసి స్వచ్ఛ శపథం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటామని, ప్లాస్టిక్ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



## ఆలూర్ మండల కేంద్రంలో..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ ముక్కెర విజయ్ కేక్ కట్ చేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను గ్రామస్థుల సహకారంతో సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో పారదర్శక పాలన, ప్రజల సమస్యల పరిష్కారం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోహన్, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, తిరుపతిరెడ్డి, కారోబర్ సంతోష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాల కల్పన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండుటెండల దృష్ట్యా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సంక్షేమం కోసం తిమ్మాపూర్ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. శుక్రవారం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండ నుంచి ఉపశమనం కల్పించేందుకు పని ప్రదేశంలో షెడ్‌నెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లేబర్ మొబిలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సోని ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ సంగమేశ్వర్ పాల్గొని కూలీలకు భరోసా కల్పించారు. గ్రామస్థులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎలుగుబంటి దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు..

**అక్షరటుడే, కామారెడ్డి:** కట్టెలు కొట్టడానికి అడవికి వెళ్లిన వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసింది. ఈ ఘటన రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండాలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. తండా వాసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన సలావత్ మత్తు ప్రతిరోజూ మాదిరిగానే కట్టెలు కొట్టడానికి అడవికి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఎలుగుబంటి మత్తుపై దాడి చేసింది. తలను పట్టుకోవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతని భార్య, అడవిలో బీడీ ఆకు కోసం వెళ్లిన మహిళలు గట్టిగా అరవడంతో ఎలుగుబంటి అక్కడినుంచి పారిపోయింది. తీవ్రంగా గాయపడిన మత్తును కామారెడ్డి జీజీహెచ్ కు తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. అయితే మత్తుపై దాడి చేసింది పులి అంటూ ప్రచారం జరిగింది. దాంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

### ఎలుగుబంటి జాడ కోసం వేట

కట్టెలు కొట్టడానికి వెళ్లిన వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచిన ఘటనతో రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండా వాసులు భయాందోళనకు గురవుతున్నారు. అడవిలో ఆడ, మగ ఎలుగుబంట్లు



తిరుగుతున్నాయని తండావాసులు పేర్కొన్నారు. వెంటనే వాటిని పట్టుకోవాలని అటవీశాఖ అధికారులను కోరారు. దాంతో ఉదయం నుంచి అటవీశాఖ రేంజ్ అధికారి మజారుద్దీన్ ఆధ్వర్యంలో అధికారులు తండా సర్పంచ్ సలావత్ బుచ్చిరెడ్డితో కలిసి ఎలుగుబంటి జాడ కోసం వేట ప్రారంభించారు. అడవిలో ఎలుగుబంటి తిరుగుతున్న ఆనవాళ్లను గుర్తించారు. దాడి చేసిన ప్రాంతాన్ని తండా వాసులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడినుంచి ఎలుగుబంటి వెళ్లిన దారి గుండా వెళ్తూ ఎలుగుబంటి ఎక్కడ ఉందో కనుక్కునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అడవిలోకి వచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## భర్త అక్రమ సంబంధం.. ఆగ్రహంతో దేహశుద్ధి చేసిన భార్య !

**అక్షరటుడే, నిజామాబాద్:** జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కాలేజీ రోడ్డులో చోటు చేసుకున్న ఒక ఘటన స్థానికంగా కలకలం రేపింది. తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఆరోపిస్తూ ఒక ఇల్లాలు నడిరోడ్డుపై ఆందోళనకు దిగింది. బాధిత మహిళ కథనం ప్రకారం.. ఆమె భర్త శ్రవణ్ కుమార్, గుత్ప గ్రామానికి చెందిన మహిళతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో వారిద్దరూ కలిసి షాపింగ్ ముగించుకుని వస్తుండగా శ్రవణ్ కుమార్ భార్య వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆగ్రహంతో ఊగిపోయిన ఆమె, భర్తతో పాటు అతని ప్రియురాలికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించింది. పోలీసులు వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శ్రవణ్ తన ప్రియురాలితో కలిసి దుబ్బ రోడ్డులో కాపురం ఉంటున్నాడన్న సమాచారంతో, ఆమె వారి ఇంటి ముందు ఆందోళన చేపట్టింది. తనకు న్యాయం చేయాలంటూ అక్కడికి చేరుకున్న పోలీసుల కాళ్లను పట్టుకుని బాధితురాలు కన్నీరుమున్నీరైంది. ఈ గొడవ జరుగుతున్న సమయంలో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళ భర్త కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో శ్రవణ్ కుమార్ తన ప్రియురాలి భర్తపై దాడికి పాల్పడడం గమనార్హం. బాధితుడు కూడా ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మందకృష్ణ మాదిగ పేరుతో చందాలు అడిగితే ఇవ్వవద్దు..



**అక్షరటుడే, గాంధారి:** మందకృష్ణ మాదిగ పేరు చెప్పి కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంగారం మాదిగ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మండల కేంద్రంలోని వ్యాపార స్థలు, ఉపాధ్యాయుల వద్ద చందాలు సేకరిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌కు వచ్చిన కొందరు వ్యక్తులు మందకృష్ణ మాదిగ పేరుతో చందాలు అడిగినట్లు తెలిసిందన్నారు. ఎవరైనా మందకృష్ణ పేరుతో వసూళ్లకు వస్తే ఇవ్వొద్దని ఆయన పేర్కొన్నారు.